ప్రభుత్వ నిర్ణయాలతోనే ఏపీ జలదోపిడీ

- సమర్థులైన ఇంజినీర్లను కేంద్రం వద్దకు పంపాలి: జస్టిస్ చంద్రకుమార్
- నీటి కోసం మరో ఉద్యమం అవసరం: హరగోపాల్

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): కృష్ణా జలాల పంపిణీపై ట్రిబ్యునల్, బోర్డుతో మాట్లాడేందుకు అవగాహన లేని వ్యక్తులను ప్రభుత్వం పంపడంతోనే ఏపీ జలదోపిడీకి పాల్పడుతున్నదని తెలంగాణ రైతు సంక్షేమ సమితి చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లో 'ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ అసోసియేషన్' ఆధ్వర్యంలో 'కృష్ణా నదీ జలాలు, సవాళ్లు-అవకాశాలు' అనే అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కృష్ణా నది సమగ్ర స్వరూపం గురించి అవగాహన లేని అధికారులు కేంద్రం ముందు ఎలా వాదనలు వినిపిస్తారని ప్రశ్నించారు. ఏపీ, తెలంగాణ జల వివాదంపై బోర్డు ఏర్పాటు చేసినా.. ఎనిమిదేండ్ల నుంచి కొత్త ప్రాజెక్టులు పెండింగ్‌లోనే ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. సమర్థులైన ఇంజినీర్లను కేంద్రం వద్దకు పంపి రాష్ట్రంలో నీటి ప్రాజెక్టులపై రిప్రజెంటేషన్ ఇప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కృష్ణా జలాల పంపిణీపై సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. 'రెండు రాష్ట్రాలు- రెండు కండ్లు' అని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు ఏపీ సీఎంగా ఉన్నారని.. ఆయనను కాదని కృష్ణా జలాల పంపిణీపై ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోగలదా? అని ప్రశ్నించారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం తరహాలో మనకు హక్కుగా రావాల్సిన నీటి కోసం ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్, విజయపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ ఆర్ రమేశ్‌రెడ్డి, పాడూరి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి వినతి

కొడంగల్/బొంరాస్‌పేట, మార్చి 5: పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన కొడంగల్‌లోని కడా కార్యాలయంలో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. బీఆర్ఎస్ హయాంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు గ్రామాల అభ్యున్నతికి సొంత నిధులను వెచ్చించి చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

50 వేల చేరువలో ఎప్‌సెట్ దరఖాస్తులు

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నది. ఇప్పటి వరకు దరఖాస్తులు 50 వేలకు చేరువలో ఉన్నాయి. బుధవారం వరకు 48,158 దరఖాస్తులు వచ్చినట్టు కన్వీనర్ ప్రొఫెసర్ డీన్‌కుమార్ తెలిపారు. ఇంజినీరింగ్‌కు 31,805, అగ్రికల్చర్, ఫార్మసీకి 16,317, రెండు పేపర్లకు 36 చొప్పున మొత్తం 48,158 మంది దరఖాస్తు చేసుకున్నట్టు వెల్లడించారు.

తెలంగాణకు అన్యాయమే
బాబు చెప్పే సమన్యాయం

మొదటిపేజీ తరువాయి...

చెప్పారు. పూర్తిగా సత్యదూరమైన విషయాలను చంద్రబాబు మాట్లాడారని, వాటికి సాక్ష్యాధారాలతో సహా తాను చూపిస్తానని పేర్కొన్నారు.

సమన్యాయం ఏదీ?

చంద్రబాబుకు రెండు రాష్ట్రాలు, రెండు కండ్లు అయితే, నాగార్జునసాగర్ ఎడమ కాలువను ఎండబెట్టి, సాగర్ కుడి కాలువ నుంచి నిండుగా నీళ్లు ఎందుకు తీసుకుపోతున్నరు? ఇదేనా సమన్యాయం? అని హరీశ్ ప్రశ్నించారు. కృష్ణా జలాల్లో ఏపీకి తాత్కాలికంగా కేటాయించిన వాటా ప్రకారం 512 టీఎంసీలు రావాల్సి ఉండగా, చంద్రబాబు 655 టీఎంసీలు వాడుకున్నారని వివరించారు. తెలంగాణకు 343 టీఎంసీలు రావాల్సి ఉండగా, 220 టీఎంసీలే వచ్చిందని చెప్పారు. ఢిల్లీలో పలుకుబడిని ఉపయోగించి బీజేపీ, చంద్రబాబు తెలంగాణ నోరు కొట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి రోజుకు రెండు టీఎంసీలు తీసుకుపోతూ తెలంగాణకు సాగు, తాగునీరు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌కు తాగునీరు, ఎడమకాల్వ కింద పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. చంద్రబాబు దత్తత తీసుకున్న మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కల్వకుర్తి, నెట్టంపాడు, కోయిల్‌సాగర్, బీమా కింద కూడా పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు. తెలంగాణ విషయంలో చంద్రబాబుది పక్షపాత ధోరణి అని విమర్శించారు. బనకచర్ల ప్రాజెక్ట్ ద్వారా సముద్రంలో కలిసే నీళ్లు తీసుకుపోతే తప్పేమిటని చంద్రబాబు అంటున్నారని, కృష్ణా నది విషయంలోనూ అదే జరిగిందని పేర్కొన్నారు. పెన్నా బేసిన్‌లో ప్రాజెక్టులు కట్టి నదీ పరీవాహక ప్రాంతం బయట కృష్ణా జలాలు వాడుతున్నారని ఆరోపించారు.

తెలంగాణ నోరు కొట్టిన చంద్రబాబు

ఉమ్మడి రాష్ట్రంలో ఆ ప్రాంతంలో ప్రాజెక్టులు కట్టి తెలంగాణ నోరు కొట్టారని, అత్యధిక ప్రాంతం తెలంగాణలో పారితే, ఎక్కువ వాటా లేకుండా అన్యాయం చేశారని హరీశ్ విమర్శించారు. అందుకే తెలంగాణ ఉద్యమం పుట్టిందని గుర్తుచేశారు. ఇప్పుడు బనకచర్ల ద్వారా 200 టీఎంసీలను గోదావరి నుంచి పెన్నా బేసిన్‌కు తరలించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బచావత్ ట్రిబ్యునల్ గోదావరిలో 1,480 టీఎంసీలను ఉమ్మడి ఏపీకి కేటాయించిందని, అప్పటి ప్రభుత్వ జీవోల ప్రకారమే 968 టీఎంసీలు తెలంగాణకు కేటాయించారని, కానీ, వాడకంలో ఎప్పుడూ 200 టీఎంసీలు దాటలేదని వివరించారు. అందుకే కేసీఆర్ గోదావరి నదిని సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో 240 టీఎంసీలతో కాళేశ్వరం ప్రాజెక్ట్, 47 టీఎంసీలతో సమ్మక్కసాగర్, 65 టీఎంసీలతో సీతమ్మసాగర్, 12 టీఎంసీలతో వార్ధా ప్రాజెక్ట్‌ను రూపకల్పన చేశారని వివరించారు. కానీ చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ఒక్కో ప్రాజెక్ట్ డీపీఆర్‌లు వాపస్ వస్తున్నాయని చెప్పారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం, చంద్రబాబు కేంద్రంలో తన పలుకుబడిని ఉపయోగించి డీపీఆర్‌లు వాపస్ వచ్చేలా చేశారని మండిపడ్డారు. ఢిల్లీలో రేవంత్‌రెడ్డిని జర్నలిస్టులు ప్రశ్నలు అడిగితే.. అవగాహన లేక 'ఐయామ్ నాట్ రైట్‌పర్సన్' అని తప్పుకున్నారని, అలాంటి వ్యక్తి చంద్రబాబును ఎదిరించి ప్రాజెక్టులు సాధిస్తరా? అక్రమ ప్రాజెక్టులను ఆపగలుగుతరా? అని ప్రశ్నించారు. చంద్రబాబు దగ్గర పనిచేసిన వారినే నీటిపారుదల శాఖ సలహాదారులుగా నియమించారని, ఇక తెలంగాణకు ఎలా న్యాయం జరుగుతుందని నిలదీశారు.

కాళేశ్వరం.. తెలంగాణ లైఫ్‌లైన్

కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ లైఫ్‌లైన్ అని హరీశ్‌రావు స్పష్టంచేశారు. 18.25 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 18.83 లక్షల ఎకరాల స్థిరీకరణతోపాటు హైదరాబాద్‌కు తాగునీటితోపాటు సగం తెలంగాణకు సాగు, తాగు నీరు అందించే ప్రాజెక్ట్ అని వివరించారు. దీనిని వ్యతిరేకించడమంటే తెలంగాణకు అన్యాయం చేయడమేనని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ చంద్రబాబు డజన్ల కొద్దీ ఉత్తరాలు రాసిన సంగతి తాము మర్చిపోమని స్పష్టంచేశారు. తెలంగాణకు అన్యాయం చేయడంలో చంద్రబాబు, జగన్‌లది ఒకేబాట అని విమర్శించారు. గోదావరిలో 969 టీఎంసీల నీళ్లు కేటాయించారు కదా.. ముందు మానికర జలాల మీద నిర్మిస్తున్న ప్రాజెక్ట్‌లను ఆపాలన్నారు. నికర జలాల వినియోగం కోసం నిర్మిస్తున్న సీతమ్మసాగర్, సమ్మక్కసాగర్, కాళేశ్వరం మూడో టీఎంసీ, వార్ధా ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ లేఖ రాశారని, నిజంగా తెలంగాణ మీద ప్రేమ ఉంటే, రెండు కండ్ల సిద్ధాంతం, సమన్యాయం నిజమే అయితే ఈ నాలుగు ప్రాజెక్ట్‌ల విషయంలో తెలంగాణకు అనుమతి ఇవ్వాలని, ఏపీకి అభ్యంతరం లేదంటూ కేంద్రానికి ఉత్తరం రాయాలని డిమాండ్ చేశారు. పాలమూరులో నిర్మిస్తున్న పాలమూరు, డిండి ఎత్తిపోతల పథకాలకు అభ్యంతరం లేదంటూ కేంద్రానికి లేఖ రాసి సమన్యాయం నిరూపించుకోవాలని సవాల్ చేశారు. పాలమూరులో వేసిన ఎన్జీటీ కేసును విత్‌డ్రా చేసుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఎంతో ఆలోచించి 45 టీఎంసీల పాలమూరు ఎత్తిపోతల కోసం నికర జలాలు కేటాయించి, కేంద్రానికి డీపీఆర్ పంపారని, సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ బజాజ్ నేతృత్వంలో కమిటీ వేస్తే, చంద్రబాబు తన పలుకుబడి ఉపయోగించి నేటి వరకు రిపోర్ట్ బయటకు రానివ్వలేదని విమర్శించారు. ఆ రిపోర్ట్ వస్తే పాలమూరు ప్రాజెక్ట్ ఆగదని, మీ సమన్యాయం నిజమే అయితే ఎందుకు పాలమూరు మీద ఎన్జీటీలో కేసు వేశారని నిలదీశారు.

చేతకాని రేవంత్‌రెడ్డి

ఢిల్లీ చంద్రబాబు చేతుల్లో ఉన్నదని, తన పలుకుబడి ఉపయోగించి బడ్జెట్‌లో ఏపీకి డబ్బులు తెచ్చుకున్నారని, సమన్యాయం అనేది నిజమే అయితే తెలంగాణకు బడ్జెట్‌లో గుండు సున్నా ఎందుకు వచ్చిందని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఎందుకంటే చంద్రబాబు రెండు కండ్లు ఏపీ వైపే చూస్తున్నాయని చెప్పారు. రేవంత్‌రెడ్డికి చేతకాలేదని, ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. మీ సమన్యాయం నిజమే అయితే, ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను తక్కుకింద అమ్ముతుంటే ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. రేవంత్‌రెడ్డి మాట్లాడరని, ఎంపీలు నోరు మెదపరని, అందుకే తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పార్టీ గొంతు విప్పాల్సి వస్తున్నదని చెప్పారు.

మేడిగడ్డను నిర్లక్ష్యం చేస్తే చరిత్ర క్షమించదు

సిద్దిపేట అర్బన్: కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణకు వరప్రదాయిని అని, ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు కండ్లు తెరవకపోతే చరిత్ర క్షమించదని హరీశ్‌రావు పేర్కొన్నారు. అన్ని వర్గాలకు మంచి చేసే ఇలాంటి ప్రాజెక్ట్‌ను నిర్లక్ష్యం చేయకూడదని ప్రభుత్వానికి హితవు పలికారు. బుధవారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లోని రంగనాయకసాగర్ ప్రాజెక్ట్‌ను హరీశ్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలైనా మేడిగడ్డలో కుంగిన ఒక పిల్లర్‌ను బాగుచేసే తీరిక లేదని మండిపడ్డారు. ఎస్సారెస్పీ స్టేజ్-2లో తుంగతుర్తి, సూర్యాపేట, భూపాలపల్లి ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో ఎస్సారెస్పీ నీరు తగ్గినప్పటికీ, కాళేశ్వరం ద్వారా రెండు పంటలకు సాగునీటిని అందించామని గుర్తుచేశారు. నేడు గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయని, ఆ నీళ్లను లిఫ్ట్ చేసి లక్షల ఎకరాల్లో పంటలను కాపాడే అవకాశం ఉన్నదని చెప్పారు. కేసీఆర్, బీఆర్ఎస్ మీద కోపంతో తెలంగాణ రైతులకు అన్యాయం చేయవద్దని ప్రభుత్వాన్ని కోరారు.

సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్‌లో నీటి పంపింగ్‌ను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

> తెలంగాణకు అన్యాయం చేస్తే బీఆర్ఎస్ పార్టీ ఊరుకోదు. ప్రజలను చైతన్యం చేసి, బీజేపీ, చంద్రబాబు కుట్రలను తిప్పికొడుతాం. రెండు కండ్ల సిద్ధాంతం, సమన్యాయంపై చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ నిర్మిస్తున్న ప్రాజెక్టులపై అభ్యంతరం లేదని కేంద్రానికి లేఖ రాయాలి.
> - హరీశ్‌రావు

> చంద్రబాబు చెప్తున్న సమన్యాయం, రెండు కండ్ల సిద్ధాంతం ఉత్తమాటలే. నాడు తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకున్నది చంద్రబాబే. నేడు నీటిని అక్రమంగా తరలించే ప్రయత్నం చేస్తున్నది చంద్రబాబే.
> - హరీశ్‌రావు

> రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనం, నిర్లక్ష్యం, బీజేపీ పక్షపాత ధోరణి వల్ల తెలంగాణకు తీవ్రనష్టం జరుగుతున్నది. రేవంత్‌రెడ్డికి కేంద్రాన్ని ఎదురించే ధైర్యం, చంద్రబాబును ప్రశ్నించే దమ్ము లేదు. ఢిల్లీని చూస్తే రేవంత్‌కు భయం, చంద్రబాబు పట్ల గురుదక్షిణ.. దీంతో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతున్నది.
> - హరీశ్‌రావు

కాళేశ్వరం ప్రాజెక్ట్ ఆపలేదన్నది అబద్ధం

తాను కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ఆపే ప్రయత్నం చేయలేదని చంద్రబాబు అనడంపై హరీశ్‌రావు స్పందించారు. ప్రాజెక్టు అడ్డుకోవడానికి చంద్రబాబు రాసిన కొన్ని లేఖలను మీడియాకు చూపించారు.

- 13-06-2018న చంద్రబాబు కేంద్రానికి రాసిన లేఖను విడుదల చేశారని హరీశ్‌రావు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు అనుమతి ఇవ్వడం పట్ల తీవ్రమైన విచారం వ్యక్తంచేస్తున్నానంటూ చంద్రబాబు ఆ లేఖలో పేర్కొన్న అంశాన్ని చదివి వినిపించారు. బనకచర్ల ద్వారా 200 టీఎంసీల నీళ్లు చంద్రబాబు తీసుకుపోయే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.
- 07-11-2015న కేసీఆర్ కల్వకుర్తి నీటి కేటాయింపులు పెంచితే దానిని వ్యతిరేకిస్తూ లేఖ రాశారని హరీశ్‌రావు చెప్పారు.
- 24-04-2016న పాలమూరు, డిండి ఎత్తిపోతల పథకాలను వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వానికి చంద్రబాబు లేఖ రాశారని హరీశ్‌రావు తెలిపారు. ఇవి శాంపిల్‌లు మాత్రమేనని, ఇంకా పదుల సంఖ్యలో చంద్రబాబు, ఆయన ప్రభుత్వం రాసిన లేఖలు ఉన్నాయని వివరించారు.
- 08-02-2016న తెలంగాణలో రాష్ట్ర విభజన కంటే ముందే ప్రారంభమైన పాత ప్రాజెక్ట్‌లైన పాలమూరు, డిండి, కాళేశ్వరం ప్రాజెక్ట్‌లను వ్యతిరేకంగా చంద్రబాబు లేఖలు రాశారని హరీశ్‌రావు వివరించారు. పాత ప్రాజెక్ట్‌లను వ్యతిరేకించిన చంద్రబాబు, ఏపీలోని కొత్త ప్రాజెక్ట్‌లను ఎవరి అనుమతి లేకుండా ఢిల్లీలో తనకున్న పలుకుబడిని ఉపయోగించి తీసుకుపోతా అంటున్నరని, ఇది సమన్యాయం ఎలా అవుతుందని ప్రశ్నించారు.

ఎంజీయూ విద్యార్థి హాస్టల్ అడ్మిషన్ రద్దు

- గొడ్డుకారం పెడుతున్నారని కేటీఆర్‌కు ఫిర్యాదు చేశాడనే నెపంతో విద్యార్థి సస్పెండ్
- కాంగ్రెస్ నేతల ఆదేశాలను పాటించిన ఎంజీయూ

నల్లగొండ, మార్చి 5 : ఎంజీయూలో ఎంఏ సైకాలజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వాడపల్లి నవీన్ హాస్టల్ అడ్మిషన్‌ను వర్సిటీ అధికారులు బుధవారం రద్దు చేశారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ హాస్టల్ విద్యార్థినులకు గొడ్డుకారం పెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు సోషల్ మీడియాలో వైరల్ కావడానికి వాడపల్లి నవీన్ కారణమని యూనివర్సిటీ డైరెక్టర్ దోమల రమేశ్ నోటీస్ ఇచ్చారు. గత నెలలో యూనివర్సిటీలో గొడ్డుకారం పెడుతున్నారనే విషయం సోషల్ మీడియాలో వైరల్ కాగా, రైతు ధర్నాలో పాల్గొనేందుకు జనవరి 21న నల్లగొండకు వచ్చిన కేటీఆర్‌కు ఇదే విషయాన్ని యూనివర్సిటీ విద్యార్థులు ఫిర్యాదు చేశారు. దీనికి కారణం వాడపల్లి నవీన్ అని యూనివర్సిటీలో వేసిన కమిటీ నిర్ధారించినట్టు నోటీసులో పేర్కొన్నారు. నవీన్‌కు సమాచారం ఇవ్వకుండానే మంగళవారం అతడి రూమ్ డోర్‌కు నోటీస్ అంటించి బుధవారం సెక్యూరిటీ గార్డ్‌తో విద్యార్థిని హాస్టల్ నుంచి గెంటి వేయించారు. నోటీస్‌కు వారం రోజుల గడువు ఉండగా తన వివరణను రాసి అదే రోజు సాయంత్రం డైరెక్టర్ దోమల రమేశ్‌కు ఇచ్చేందుకు వెళ్తే పట్టించుకోలేదని, వివరణ లెటర్ తీసుకోకుండానే వెనక్కి పంపించారని నవీన్ ఆవేదన వ్యక్తంచేశారు.

రాహుల్‌గాంధీకి రూ. 200 జరిమానా

లక్నో: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి ఉత్తరప్రదేశ్‌లోని లక్నో కోర్టు రూ.200 జరిమానా విధించింది. సావర్కర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని దాఖలైన కేసు విచారణకు బుధవారం ఆయన హాజరుకావలసి ఉంది. కానీ ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉందని, హాజరు నుంచి రాహుల్‌కు మినహాయింపు ఇవ్వాలని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు కోరారు. దీంతో అదనపు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు రాహుల్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. వచ్చే నెల 14న విచారణకు తప్పనిసరిగా ఆయన హాజరుకావాలని, గైర్హాజరైతే ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

ప్రశ్నిస్తే వర్సిటీ నుంచి సస్పెండ్ చేస్తరా?

- ఎంజీయూలో గొడ్డు కారం పెట్టింది నిజం కాదా?
- విద్యార్థులకు మంచి ఆహారం పెట్టాలని కోరడం తప్పా?
- విద్యార్థి భవిష్యత్తు గురించి ఒక్క నిమిషం ఆలోచించరా?
- బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫైర్

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): హాస్టల్‌మెస్‌లో గొడ్డుకారం పెడుతున్నరని, నాణ్యమైన భోజనం అందించాలని ప్రశ్నిస్తే నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థిని సస్పెండ్ చేస్తారా? అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ చర్య సీఎం రేవంత్‌రెడ్డి నియంతపాలనకు నిదర్శనమని బుధవారం ఒక ప్రటకనలో ఫైర్ యయ్యారు. 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తెలంగాణ ఉద్యమం గురించి మీకు తెల్వకపోతే తెలుసుకోవాలని సూచించారు. వాడపల్లి నవీన్ మహాత్మాగాంధీ యూనివర్సిటీలో సైకాలజీ డిపార్ట్‌మెంట్ పీజీ సెకండ్ ఇయర్ చదువుతున్నాడని తెలిపారు. యూనివర్సిటీ హాస్టల్‌మెస్‌లో గొడ్డుకారం పెట్టారని ప్రశ్నిస్తే బహుమానంగా యూనివర్సిటీ నుంచి సస్పెండ్ చేయడం మీ నియంతపాలనకు నిదర్శనమని విమర్శించారు. మీరు గొడ్డుకారం పెట్టింది నిజం కాదా? విద్యార్థులకు మంచి ఆహారం పెట్టాలనడం తప్పా అని ప్రశ్నించారు. మీ ప్రభుత్వ దిష్టిబొమ్మ తగులబెట్టాడా? ధర్నా చేసి నిరసన తెలిపాడా? ఎందుకు ఇంత పెద్ద నిర్ణయం? కేవలం నవీన్ బీఆర్ఎస్‌వీ విద్యార్థి నాయకుడనే కదా.. ఇలా చేశారని మండిపడ్డారు. కనీసం విద్యార్థి భవిష్యత్‌పై ఒక్క నిమిషం ఆలోచించరా ఆగ్రహం వ్యక్తంచేశారు. మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలని హితవు పలికారు. లోపాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తనంటే.. ఎంతమందిని చేస్తరో.. విద్యార్థులతో పెట్టుకొని ఎంతకాలం అధికారంలో ఉంటరో మేం కూడా చూస్తం!' అని ఆర్ఎస్‌పీ హెచ్చరించారు.

గురుకులాలను ఏం చేద్దామనుకుంటున్నరు?

రాష్ట్ర గురుకులాల్లో విద్యార్థుల వరుస ఆత్మహత్యయత్నాలపై బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బుధవారం ఎక్స్ వేదికగా స్పందించారు. అసలు సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఏం జరుగుతున్నదని, వాటిని ఏం చేద్దామనుకుంటున్నరని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. మొన్నటి బెల్లంపల్లి ర్యాగింగ్ సంఘటన మరువక ముందే మళ్లీ వికారాబాద్ కొత్తగడి సంక్షేమ పాఠశాలలో వైస్ ప్రిన్సిపల్ వేధింపులు భరించలేక మరో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఆందోళన కలిగిస్తున్నదని అన్నారు. నిరుడు ఎన్నడూ లేనంతగా ఎస్సీ గురుకులాల్లో వరుస దుర్ఘటనలు తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో ఆడబిడ్డలు ఎంతో ఆనందంగా బతికారని గుర్తుచేశారు. ఈ వరుస ఘటనల వెనక ఈ పిల్లలను మళ్లీ వెలివాడలకే పరిమితం చేయాలన్న కుట్రదాగి ఉన్నదేమోనని అనుమానం వ్యక్తంచేశారు. ఈ ఘటనలపై వెంటనే విచారణకు ఆదేశించాలని ఆర్ఎస్‌పీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కేంద్రం కొర్రీ.. కూలీలు వర్రీ

- ఉపాధిహామీలో పెండింగ్ పనులకు మంగళం
- కొత్తపనులే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు
- ఇట్లయితే పూర్తిస్థాయి పనిదినాల కల్పన కష్టమే
- కేంద్రం తీరుపై కార్మిక సంఘాల అభ్యంతరం

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): ఉపాధిహామీ పథకం అమలుపై ఆది నుంచీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మోదీ ప్రభుత్వం కొత్త కొత్త కొర్రీలు పెడుతూ నిర్వీర్యం చేసేందుకు యత్నిస్తున్నది. కొన్నేళ్లుగా పనిదినాలను తగ్గించుకుంటూ వస్తున్నది. ఇదే కోవలో తాజాగా ఈ పథకంలో పెండింగ్ పనులను పక్కనబెట్టి కొత్తవాటినే చేపట్టాలని నిర్దేశిస్తూ ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో లక్ష్యం మేరకు పనిదినాలు కల్పించడం కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం మల్లగుల్లాలు..

ఉపాధిహామీలో కొత్త పనులే చేపట్టాలని కేంద్రం నిర్దేశించడంతో పనిదినాల పూర్తిపై రాష్ట్ర సర్కారు మల్లగుల్లాలు పడుతున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 12 కోట్ల పనిదినాలకు ఇప్పటికే సుమారు 10.3 కోట్ల పనిదినాలు పూర్తిచేసింది. మిగిలిన 27 రోజుల్లో 1.7 కోట్ల పనిదినాలు కల్పించాల్సి ఉన్నది. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పనులపై దృష్టిపెట్టింది.

మొదటి నుంచీ నిర్లక్ష్యమే..

పేదలకు ఉపాధినిచ్చి ఆర్థిక, ఆహార సాధికారిత కల్పించాలనే సదుద్దేశంతో చేపట్టిన ఈ పథకం అమలుపై మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నది. ఇప్పటికే పలుమార్లు పనిదినాలు తగ్గించింది. వేతనాలివ్వడం, పెంపుపై అలక్ష్యం చేస్తున్నది. తాజాగా చేపట్టిన పనులే మళ్లీ చేస్తున్నారనే సాకుతో పాత పనులకు మంగళంపాడింది. ఈ నిబంధనతో పనులు పూర్తిచేసేందుకు అవరోధాలు ఎదురవుతున్నాయి. దీంతో గ్రామీణులకు మౌలిక సౌకర్యాల కల్పన ఇబ్బందికరంగా మారనున్నది.

కార్మిక సంఘాల అభ్యంతరం..

ఉపాధిహామీ కింద పాతపనులను చేపట్టవద్దని కేంద్రం జారీ చేసిన ఆదేశాలపై కార్మిక సంఘాలు, కూలీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గత సర్కారు తెచ్చిందనే నెపంతో పూర్తిగా ఎత్తేసేందుకు కుట్రలు చేస్తున్నదని ఆరోపిస్తున్నారు. అందుకే కొత్త కొత్త నిబంధనలు పెడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వెంటనే ఈ నిబంధనను ఎత్తేయడంతోపాటు పనిదినాల సంఖ్యను పెంచాలని, సకాలంలో వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. లేదంటే ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నారు.

ప్రణయ్ హత్య కేసులో 10న తుది తీర్పు

- ఇరుపక్షాల వాదనలు పూర్తి
- జడ్జిమెంట్‌కు రంగం సిద్ధం
- ఈ కేసులో మొత్తం ఎనిమిది మంది నిందితులు
- అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పరువు హత్య కేసు

నల్లగొండ, మార్చి 5: నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని జ్యోతి దవాఖాన సమీపంలో జరిగిన పెరుమాళ్ల ప్రణయ్ హత్య కేసుకు సంబంధించి తుది తీర్పునకు రంగం సిద్ధమైంది. ఈ కేసుపై ఇరు పక్షాల వాదనలు, సాక్ష్యాలు, ఆధారాల సమర్పణ పూర్తి కావడంతో ఈ నెల 10న తుది తీర్పు వెలువరించేందుకు రెండో అదనపు సెషన్స్ కోర్టు, ఎస్సీ ఎస్టీ కోర్టు జడ్జి సిద్ధమయ్యారు. 2018 సెప్టెంబర్ 14న మిర్యాలగూడలో ప్రణయ్ హత్య జరుగగా ఆయన తండ్రి బాలస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు 302, 120 బీ ఎస్సీ, ఎస్టీ సెక్షన్ల కింద కేసు 8 మందిపై కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఏ1గ